క్లుప్తంగా

రేపు నార్సింగిలో బిజినెస్ నెట్‌వర్కింగ్ సదస్సు

మణికొండ: ప్రపంచంలోనే అతిపెద్ద రెఫరల్ మార్కెటింగ్ సంస్థ అయిన బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బీఎస్ఐ) బుధవారం నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో 3వేల మంది వ్యాపారవేత్తలతో సదస్సు నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు ఇందులో పాల్గొంటారని, ఆసక్తి గల వారు 70951 00063లో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి కాశీ విశ్వనాథుని ఆలయ వార్షికోత్సవం



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, భాగ్యలక్ష్మీకాలనీలోని ఉమా కాశీ విశ్వనాథుని ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు దేవరాజు నాయుడు, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయి పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షాబంధనం, పంచగవ్య ప్రాసన, రుత్విక్‌వరుణ, మండప పూజ, కలశ స్థాపన, మధ్యాహ్నం మహా నైవేద్యం, సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ, దేవతా గణపతి, ఆవాహిత హోమాలు, చతుర్వేద పారాయణం జరుగుతుందన్నారు. గురువారం శివపార్వతుల కల్యాణం జరుగుతుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ముగిసిన మల్లన్న ఉత్సవాలు



మల్లన్న స్వామిని దర్శించుకున్న మణికొండ మున్సిపల్ కమిషనర్

మణికొండ: మూడు రోజులుగా జరుగుతున్న మణికొండ మల్లన్న ఉత్సవాలు సోమవారం ఒడిబియ్యం ప్రసాద వితరణతో ముగిశాయి. మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్, టీపీఓ రాకేశ్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన వారందరికీ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జైహింద్‌రావు, అధ్యక్షుడు ముత్యాలు, ప్రధాన కార్యదర్శి లక్ష్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆధార్ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల ఇబ్బందులను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపిస్తున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లిలో ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక చొరవ తీసుకొని సీఎస్‌సీ సెంటర్‌ను అధికారులతో చర్చించి ఏర్పాటు చేయించామన్నారు. ప్రతిఒక్కరే ఆధార్ కార్డులో పేరు, చిరునామా అడ్రస్ మార్పులు తదితర వాటిని సరిచేసుకునేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆధార్ కేంద్రాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

పుల్లారెడ్డికి గోల్డ్ మెడల్



రాజేంద్రనగర్: మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో హైదర్‌గూడ నివాసి గంగిడి పుల్లారెడ్డి ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో పుల్లారెడ్డి 200 మీటర్ల విభాగంలో రెండు సిల్వర్ మెడల్స్, 100 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఆయన అర్హత సాధించారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

గోల్కొండ: దుర్గాదేవి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. టోలిచౌకి, షేక్‌పేట్, కార్వాన్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో దుర్గమ్మకు జరిగిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఈ పూజల్లో టోలిచౌకి బీజేపీ డివిజన్ నాయకుడు బొమ్మల శ్రీకాంత్ చారి దంపతులు అమ్మవారి జరిగిన ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



రాష్ట్ర బడ్జెట్‌పై పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం పర్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్టణ ప్రగతి మేలు చేయడంతో పాటు ప్రజా సంక్షేమానికి బాటలు వేసిందని బీఆర్ఎస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్షాల నేతలు మాత్రం బడ్జెట్ కేవలం అంకెలగారడిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, బలహీన వర్గాల సంక్షేమ రాష్ట్ర సర్కారు పట్టడం లేదన్నారు.

– శంషాబాద్/రాజేంద్రనగర్

పట్టణ ప్రగతికి బాటలు వేసే బడ్జెట్..



2013–24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాసంక్షేమ బడ్జెట్‌గా ఉంది. అంతేకాకుండా పుర, నగరపాలల్లో పట్టణ ప్రగతిని పెంచే దిశగా బడ్జెట్ కేటాయింపు జరిగింది. పురపాలక శాఖకు మొత్తం 11,372 కోట్లు కేటాయించారు. ఇందులో వైకుంఠధామాలను అన్ని వసతులతో తీర్చిదిద్దేందుకు రూ.346 కోట్లు కేటాయించడం, అర్బన్ మిషన్ భగీరథ కింద సురక్షిత తాగునీటినందించేందుకు రూ. 6578 కోట్లు కేటాయించడం మంచి పరిణామం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రూపకల్పకు కూడా అత్యధికంగా నిధులు కేటాయించడంతో శంషాబాద్ రూపురేఖలు మరింత మారనున్నాయి. – సుష్మారెడ్డి, శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్

హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు హర్షణీయం..



బడ్జెట్‌లో ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసన్జా అని చెప్పడం హర్షణీయం. చందా లేకుండానే ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలి. లేని పక్షంలో చందా నుంచి చిరుద్యోగులను, ముఖ్యంగా బీసీ ఉద్యోగులను మినహాయించాలి. ఈహెచ్ఎస్ పరిధిలోకి మోడల్ స్కూల్ రెసిడెన్షియల్ కేజీబీవీ టీచర్స్‌ను ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను తీసుకురావాలి. బకాయి పడ్డ మిగతా డీఏలను త్వరలో విడుదల చేయాలి. కొత్త పీఆర్‌సీని 100శాతం ఫిట్మెంట్‌తో వెంటనే అమలు చేయాలి.

– చంద్రశేఖర్‌గౌడ్, తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్

రుణమాఫీ అస్తవ్యస్తం..



రుణమాఫీ ఏకకాలంలో చేపట్టకపోవడంతో రైతుల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. రైతుబంధు లాంటి మొత్తాలను కూడా బ్యాంకులు వడ్డీ కిందనే జమ చేసుకుంటున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రుణమాఫీని ఏకకాలంలో మాఫీ చేస్తున్నట్లు బడ్జెట్‌లో లేదు. ఇప్పటికే బ్యాంకులు రైతులకు రుణాలు ఇచ్చేందుకు మొగ్గుచూపడం లేదు. బలహీన వర్గాల సంక్షేమానికి అతి తక్కువగా రూ.6,229 కోట్లు మాత్రమే కేటాయించారు. బడ్జెట్ మొత్తం అంకెలగారడిగా ఉంది.

– నందకిశోర్‌గుప్తా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

క్రైం కార్నర్..

అద్దె ఇంటికి అడ్వాన్స్ ఇస్తానంటూ.. రూ.50వేలు స్వాహా

శంషాబాద్ రూరల్: ఓఎల్ఎక్స్ యాప్‌లో ప్రకటన చూసి ఇల్లు అద్దెకు తీసుకుంటానని ఓ వ్యక్తి యజమాని బ్యాంకు ఖాతా నుంచి రూ.50వేలు దోచుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఊట్‌పల్లిలో నివాసముండే శారదాదేవికి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఇల్లు ఉంది. ఈ ఇంటిని అద్దెకు ఇవ్వడానికి ఓఎల్ఎక్స్ యాప్‌లో ప్రకటన చేసింది. యాప్‌లో ప్రకటన చూసిన దీపక్‌పవర్ అనే వ్యక్తి ఇంటిని అద్దెకు కావాలని అడగగా అందుకు సంబంధించిన ఫొటోలు వాట్సాప్‌లో పంపింది. దీంతో అతను ఇల్లు నచ్చిందని అడ్వాన్స్‌గా గూగుల్‌పే ద్వారా డబ్బులు ఇస్తానని చెప్పాడు. ఇందుకు ఆమెను ఈనెల 5న గూగుల్‌పే చేస్తానని చెప్పి ఓపెన్ చేయమన్నాడు.

ఆమెకు అందులో ఓ లింక్ పంపించాడు. లింక్‌ను ఓపెన్ చేసి పిన్ నంబరు ఎంటర్ చేయమనగా.. శారదాదేవి అతను చెప్పినట్లు చేసింది. కాసేపటికే తన ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.50వేలు డెబిట్ అయినట్లు మేసేజ్ వచ్చింది. తర్వాత ఆమె అతని ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గుర్తించి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



నరేష్



పద్మమ్మ

శంషాబాద్: వర్కింగ్ హాస్టల్‌లో ఉంటున్న యువకుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణం రాంనగర్‌కు చెందిన పల్లె నరేష్ (28) నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ పట్టణంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. సంక్రాంతి ఊరెళుతున్నట్లు హాస్టల్‌లో చెప్పి బయలుదేరిన అతడు అక్కడికి చేరుకోలేదు. విషయం తెలుసుకున్న కుంటుబసభ్యులు అతడి కోసం అన్ని చోట్లా వెతికినా ఆచూకి లభించలేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో సోమవారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం..

మధురానగర్ కాలనీలో నివాసముంటున్న వట్టిల పద్మమ్మ (60) గతనెల 31న సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అన్నిచోట్లా వెతికినా ఆచూకి లభించలేదు. ఈ మేరకు సోమవారం కుటుంబసభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సంజు(40), ఉమా భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. కొన్ని సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి దుర్గానగర్‌లో ఉంటున్నారు. సంజు ఫంక్షన్ హాల్‌లో క్యాటరింగ్ పని చేస్తుంటాడు. ఈనెల 2న సాయంత్రం పనికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చి రక్తం వాంతులు చేసుకున్నాడు. స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. 3న మరోసారి రక్తం వాంతులు చేసుకోవడంతో ఉస్మానియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో జగన్నాథరావు మృతి



మణికొండ: ఇన్ఫర్మేషన్, పబ్లిక్ రిలేషన్ శాఖలో జాయింట్ డైరెక్టర్‌తో పాటు అప్పటి గవర్నర్ కృష్ణకాంత్ వద్ద ప్రెస్ సెక్రటరీగా పనిచేసిన భామిడిపాటి జగన్నాథరావు(89) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని సెవన్‌హిల్స్ అపార్ట్‌మెంట్స్‌లో తన కూతురు వద్ద ఉంటున్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఉదయం అతని ఆరోగ్యం విషమించి మృతి చెందారు. అంత్యక్రియలు రాయదుర్గంలోని మహాప్రస్థానంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వండి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

మణికొండ: గండిపేట మండల పరిధిలోని పలు బస్తీల్లో తామంతా 15 ఏళ్లుగా నివసిస్తున్నా తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి చేయూత అందలేదని, ఇకనైనా తమకు డబుల్ బెడ్‌రూం గృహాలు, ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు సమక్షంలో వారంతా సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వారి గోడును చెప్పుకున్నారు. ఇప్పటికే పలుమార్లు తమకు డబుల్ బెడ్‌రూం గృహాలు కేటాయించాలని దరఖాస్తులు పెట్టుకున్నామని, అయినా ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం, కేటాయింపులు జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రుద్రకుమార్, ప్రవీణ్‌కుమార్, జగదీష్, దివ్య ప్రతాప్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తోన్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ చెప్పారు. సోమవారం 12వ వార్డులో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, స్థానిక కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్‌తో కలిసి అంతర్గత డ్రైనేజీ పనులు ప్రారంభించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పట్టణం నంబర్ వన్‌గా ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. దశలవారీగా అన్ని వార్డుల్లో అంతర్గత డ్రైనేజీ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

మణికొండ: బోర్లు వట్టిపోవటం, జలమండలి నీటి పైప్‌లైన్లు వేసి కనెక్షన్లు ఇవ్వకపోవటంతో తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, వెంటనే జలమండలి పైప్‌లైన్ నుంచి పలు చోట్ల కనెక్షన్లు ఇవ్వాలని నెమలినగర్ వాసులు జమమండలి మేనేజర్ స్ఫూర్తి రెడ్డిని కోరారు. సోమవారం కాలనీ వాసులు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, సీఐటీయూ నాయకుడు రుద్రకుమార్ ఆధ్వర్యంలో జలమండలి మేనేజర్‌ను కలిసి వారి నీటి సమస్యను వివరించారు. గతంలో ఉన్న ఐదు బోర్లలో నాలుగు వట్టిపోయాయని, జలమండలి నీటి పైప్‌లైన్లకు అక్కడక్కడా కనెక్షన్లు ఇస్తే సమస్య తీరుతుందన్నారు. 3వేల జనాభా ఉంటున్న చోట నీటి ట్యాంక్, సంప్ నిర్మాణం చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరారు.

సన్మానం



సౌమ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

శంషాబాద్ రూరల్: నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి ఎయిమ్స్‌లో మెడికల్ సీటు పొందిన పూర్వ విద్యార్థినిని మోడల్ స్కూల్ అధ్యాపకుల బృందం సోమవారం సన్మానించారు. పాల్మాకులలో ఉన్న మోడల్ స్కూల్‌లో కె.సౌమ్య ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివింది. ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న సౌమ్య నీట్–2022 పరీక్ష రాసింది. ఇందులో 3493 ఆల్ ఇండియా ర్యాంకు రాగా.. 138 స్టేట్ ర్యాంకు పొందింది. చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉన్న సౌమ్య తన కల నెరవేర్చుకోవడానికి పట్టుదలతో కృషి చేయడం అభినందనీయమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ అన్నారు.

మహా శివరాత్రి మహోత్సవాల | వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



రాజేంద్రనగర్: మహాశివరాత్రి మహోత్సవాలను చిన్న అనంతగిరి శివాలయంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు నర్సింహ్మా తెలిపారు. ఈనెల 17, 18, 19 తేదీల్లో రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు సోమవారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, సనివెళ్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, జాయింట్ సెక్రటరీ కొండమీది హరినాథ్, రావుల గండయ్య, కోశాధికారి హరినాథ్, మ్యాడం రామేశ్వర్ రావు, మోంద్ర కొమురయ్య, ప్రచార కార్యదర్శి మోంద్ర ఐలయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేయాలి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఆమరణ దీక్షలను సోమవారం ప్రారంభించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ పరిపాలనా భవనం ముందు ఏబీవీపీ విద్యార్థులు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హెచ్‌సీయూ ఏబీవీపీ నాయకులు కర్నీసింగ్, అక్షయ్, ధరమ్‌వీర్, నిఖిల్, అఖిల్‌లు ఆమరణ నిరాహార దీక్షలను చేపట్టారు.

హెచ్‌సీయూలో అణగారిన వర్గాలవారిని అణిచివేయడానికి చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని, అన్ని వర్గాల వారికి న్యాయం చేకూర్చేలా చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు

గోల్కొండ: కులమతాలకు అతీతంగా పేదలకు ఉచితంగా న్యాయసేవలు అందించేందుకు కొత్తగా లీగల్ వ్యాగన్ అనే సంస్థను ఏర్పాటు చేశామని ముస్లిం అడ్వొకేట్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ వహీద్ అహ్మద్ అన్నారు. సోమవారం టోలిచౌకిలో విరాట్‌నగర్‌కుంటలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ న్యాయవాదులు పేదలకు న్యాయ సలహాలు అందించేందుకు లీగల్ వ్యాగన్‌ను స్థాపించడం జరిగిందన్నారు. అకారణంగా ఎందరో పేదలు బెయిల్ పొందలేక జైళ్లలో మగ్గుతున్నారన్నారు. అటువంటి వారి వివరాలు తెలుసుకుని వారు నిర్దోషులుగా నిర్ధారించుకున్న తరువాత వారికి బెయిల్ ఇచ్చి వారి పక్షాన నిలబడుతామన్నారు. ఈ సందర్భంగా వహీద్ అహ్మద్‌ను స్థానికులు సన్మానించారు. మహ్మద్ బిలాల్, సలాం, మహ్మద్ ఒవైస్ ఉద్దీన్ తదితరులున్నారు.



కార్యక్రమంలో వహీద్ అహ్మద్ తదితరులు

నిరుపేదలకు మజ్లిస్ అండ: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నిరుపేదలు, దివ్యాంగులకు మజ్లిస్ పార్టీ అండగా ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఉదయం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజెన్స్ ఆయనకు తమకు ఆసరా పింఛన్లు సమయానికి రావడం లేదని ఫిర్యాదు చేశారు ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు మంజూరు అయ్యాయని, అయితే సాంకేతిక కారణాల కారణంగా కొన్ని దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి వాటిని కూడా త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆయన అన్నారు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికి తమ ఇంటి ముందు నీళ్లు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది వర్షపు నీరు రోడ్లపై నిలిచే పరిస్థితి ఉండదని ఆయన స్పష్టం చేశారు. వరదనీరు సాఫీగా ముందుకు వెళ్లేలా డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. మజ్లిస్ నాయకులు జబ్బార్, జాకెర్ పాల్గొన్నారు.

11న జర్నలిస్టు అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

మైలార్‌దేవ్‌పల్లి: ఈనెల 11న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాజేంద్రనగర్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తలపడుతున్న జర్నలిస్టు అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. 20–20 జరిగే ఈ మ్యాచ్‌లో ప్రింట్ మీడియా క్రీడాకారులు సోమవారం ప్రాక్టీస్ చేశారు.

జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, వెంకటేష్ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో క్రీడాకారులు వర్కల చందు, లక్ష్మణ్, శ్రీకాంత్, కిరణ్, బాబురావు, భీమయ్య, దామోదర్‌రెడ్డి, విజయ్, యాదగిరి, నాగేష్ తదితరులు ప్రాక్టీస్ చేశారు. తనదైన శైలిలో వర్కల చందు ప్రాక్టీస్ మ్యాచ్‌లో తొలి ఓవర్‌లోనే హ్యాట్రిక్ వికెట్ సాధించి రికార్డు నమోదు చేసుకున్నారు. ఈనెల 11న జరిగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా హోరాహోరి పోరు జరగనుంది.

ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ తదితరులు

శంషాబాద్: వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ మూడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అధ్యాత్మిక కార్యక్రమాలు మనసును ఆహ్లాదపరుస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆర్యవైశ్య సంఘం నేతలు ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి చింతల నందకిశోర్‌గుప్తా, సంఘం నేతలు సర్వేశ్వర్‌రావు, చింతల రాము, గౌతవివేకాగుప్తా, కొత్త ధర్మ, గౌరిశంకర్, సతీష్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం ప్రారంభం



మాధవినగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మాధవినగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంధత్వం లేని తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి కళ్లద్దాలు, మందులు, ఆపరేషన్‌లు సైతం చేస్తున్నారన్నారు. కేంద్రాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విద్యా వ్యవస్థను రాష్ట్ర సర్కారు గాలికొదిలేసింది'



బహిరంగ సభలో ఏబీవీపీ వక్తలు, నాయకులు

శంషాబాద్: విద్యా వ్యవస్థను రాష్ట్ర సర్కారు గాలికొదిలేసిందని ఏబీవీపీ వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో శంషాబాద్ కన్వీనర్ మహేష్ ఆధ్వర్యంలో సోమవారం ఏబీవీపీ రంగారెడ్డి జిల్లా సమ్మేళనం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలనసాగుతోందన్నారు. విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందన్నారు. కళాశాలల్లో అధ్యాపకులు, పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ జరగకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు, దేవేందర్‌రెడ్డి, సూర్యప్రకాష్, మహేందర్, శ్రీవర్ధన్‌రెడ్డి, అశోక్, ప్రవీణ్, శరత్, రాజురెడ్డి పాల్గొన్నారు.